# ఏ గూటి సిలక

ఆ పూరి గుడిసెల మధ్య ఎప్పటిలాగే తెల్లారింది.

పకృతి ప్రసాదించిన వెలుగు రేఖలతో బాటు పరిసరాల దుర్గంధం కూడా నిష్పక్షపాతంగా ఆ గుడిసెల్లోకి ప్రసరిస్తోంది.

ఆ గుడిసెలకి అవతల కొంత దూరంలో ప్రవహిస్తున్న మురికి కాలవ చీకట్లో ఆడవాళ్లకీ, వెలుతుర్లో మగవాళ్లకి బహిఃప్రదేశంగా ఉపయోగపడుతోంది. నిరంతరం ఝుమ్మని ఆకాలవనంటిపెట్టుకొని ఉండే ఈగలు, దోమల్లాగే ఆ గుడిసెల్లో పిల్లలు కూడా మురికి ఓడుతూ ఉంటారు.

అక్కడ చావుపుట్టుకలకి ఒక్కలాగే సంబరాలు జరుగుతాయి. పుడితే నవ్వుల మధ్య, చస్తే ఏడుపుల మధ్య కల్లుకుండలు ఖాళీ అవుతాయి. కోడిపుంజుల తలలు తెగుతై, ఆస్తి తగాదాలు, అంతస్తుల తేడాలు లేవక్కడ. అయిన, ఏ రోజూ ఏదో ఒకచోట గొడవ జరుగుతూనే ఉంటుంది. ఆవేశంతో ఒళ్లుమరిచిపోయి బతుకుల్లోని రహస్యాలన్నీ బట్టబయలు చేసేసుకుంటారు అంతలోనే అన్నీ మరచిపోయి అవసరానికి కలిసిపోతారు.

తమ బతుకుల్లోని చీకటిని గురించ ఆలోచించడానికి కూడా టైం లేనంత బిజీ మనుషులు వాళ్లు. ఎంత బిజీ మనుషులో అంత లేజీ గానూ గడిపేయగలరు వాళ్లలో కొందరు.

మొగుడు రెక్కలు ముక్కలు చేసుకొని తెచ్చింది సినిమాలకి, షోకులకి క్షణాల్లో ఆర్పేసే ఆడంగులున్నారు వాళ్లలో-

పెళ్లాం ఊపిరంతా ధారపోసి ఊడిగం చేసి తెచ్చింది తన్ని లాక్కుని తాగి తగలేసే ప్రబుద్ధులున్నారు వాళ్లలో, ఇద్దరూ సంపాదించినా అధిక సంతానం కావడంతో సగం పొట్టలైనా నింపుకోలేని నిస్సహాయులూ ఉన్నారు వాళ్లలో.

అన్నిటికీ అతీతంగా ఆ గుడిసెలకి రాణిలా వెలిగిపోతోంది మణెమ్మ ఒక్కతే.

మణెమ్మ మొగుడు సూరీడు మంచి మనిషి. ఎంత మంచి మనిషంటే.. తనపనేమో, తానేమో తప్ప ఎవరి జోలికీ పోడు, సంపాదించి తెచ్చిన డబ్బులు పెళ్లాం చేతిలో పోస్తాడు పెళ్లాం చేసిపెడితే తప్ప బయట చిరు తిళ్లేవీ తినడు. తాగుడులాంటి పెద్ద అలవాట్లు కాదు కదా, చుట్ట బీడీ లాంటి చిన్న అలవాట్లు కూడా లేవు. నోట్లో వేలు పెట్టినా

కొరకలేని మెత్తని మనిషతనం. మొగుడి మెత్తదనంవల్లో, పరిసరాల ప్రభావం వల్లో మణె మ్మకి నోరు పెద్దది.

అందరి కష్టాల్లోనూ తృణమోపణమో సాయంచేసి ఆదుకునే మణెమ్మ మంచిపే రుతో బాటు, నోటిదురుసుతనంతో ఎదుటివాళ్లని ఎంత మాటైనా అనేసి చెడ్డపేరు కూడా తెచ్చుకుంది. వెనక ఎవరేమనుకున్నా ఆవిడ ఎదుట మాత్రం నోరెత్తడానికి ఆవాడ కట్టు లోని ఎవరికీ దమ్ముల్లేవు.

రోజూ తలనిండా పూలెట్టుకొని సింగారించుకుంటుందని, మొగుడితో కలిసి వారా నికో సినిమా చూస్తుందని ,నెలకో కొత్తకోక కొనుక్కుంటుందనీ ఆడవాళ్లందరికీ ఆవి డంటే కడుపుమంట.

మొదట్లో...'వాళ్లేపుడతార్లే తొందరేంటి? ఆలీసెంగా పిల్లలు పుడితే ఈ లోగా బతుకులో అందాలన్నీ అనబగించెయ్యొచ్చు .కలిసొచ్చే కాలానికి నడిసొచ్చేకొడుకు పుట్ట కపోడు' అనుకుంటూ నిర్లక్ష్యం చేసిన మణెమ్మకి అనుమానం ఇంతింతై వటుడింతై అన్నట్టు పెరిగిపోయింది.

అప్పుడు మొదలైంది ఆవిడ చెట్లకీ పుట్లకీ మొక్కడం, మందులూ మాకులూ మింగడం . ఎవరో చెప్తే చివరికి చిన్నాపరేషను కూడా చేయించుకుంది. ఊహు: ఫలితం మాత్రం సున్నా. సూరీడు లోనూ ఏ లోపం లేదన్నారు డాక్టర్లు. ఇంకేంచెయ్యాలో తోచక సమయం దొరికినప్పుడల్లా పుట్టని పిల్లల్ని తలుచుకొని కుమిలిపోవడం మొదలుపెట్టింది మణెమ్మ. ఫలితంగా దుక్కలాంటి మనిషి చిక్కి సగమయ్యింది.

తల్లో పూలెట్టుకోవడం మానేసింది. వారానికో సినిమాకి,నెలకో కొత్తకోకకి తిలో దకాలిచ్చేసింది. ఏదో దిగులు ఎల్లప్పుడూ ఆవిడ ముఖంలో తాండవిస్తోంది. ఇదంతా భరిం చలేక పోయాడు సూరీడు. భార్యని సాధ్యమైనంత వరకు ఊరడించాలని ప్రయత్నించాడు 'నీకు నేను, నాకు నువ్వు పిల్లలం' అన్నాడు . ' ఎదవ పిల్లలున్నోళ్లకేం సుకం? మంది సూడు రాజా బతుకు' అన్నాడు. పిల్లలున్నోళ్లంతా ' ఎందుకొచ్చిన పిల్లలురా దేవుడా ' అని ఏడుస్తున్నారన్నాడు. వెయ్యి చెప్పాడు, లక్ష చెప్పాడు, మణెమ్మ మనసు మాత్రం మార్చ లేకపోయాడు.

ఇంకా ఈమధ్య సూరీడుని చూస్తే చాలు పూనకం వచ్చిన దాన్లా అయిపోతోంది. తోక తొక్కిన తాచులా లేచి నోటికొచ్చినట్లు తిట్టేస్తోంది.

ఏదో ఒక చంటి పిల్లని తెచ్చి పెళ్లాం ఒళ్లో వెయ్యడం తప్ప మరేం చెయ్యలేననుకు న్నాడు సూరీడు.

అందుకే ,చెప్పాపెట్టకుండా ప్రయాణమైపోయి పక్క ఊళ్లో ఉన్న సీతిని వెంట బెట్టుకొచ్చాడు.

సీతి– మణెమ్మ చెల్లెలు.

రెండేళ్ల సీతి కొడుకుని చంకనెత్తుకొని, నిండుగర్భంతో ఉన్న సీతిని వెంటబెట్టు కొచ్చిన మొగుణ్ణి అర్థం కానట్టు ప్రశ్నార్ధకంగా చూసింది మణెమ్మ.

''సీతి ఇక్కడే నీళ్లాడుతుంది'' ఎటో చూస్తూ అనేసి బైటికి అదే పోక పోయాడు సూరీడు.

వచ్చిన నాలుగు రోజులకే నొప్పులు మొదలై పండంటి ఆడపిల్లను కన్నది సీతి.

ఆ పిల్ల భూమ్మీద పడ్డమే మొదలు మణెమ్మ కళ్లకి వెలుగులొచ్చాయ్. మంత్ర సాని బొడ్డుకొయ్యడమే తరవాయి పిల్లనందుకొని నీళ్లతో శుభ్రంగా తనే కడిగింది. మెత్తని పాడిబట్టతో తడి ఒత్తింది. ఆ చిన్ని మాంసపు ముద్దలాంటి పసికందు మణెమ్మ మన సులో ఏవో మూలల్ని కదిపి కుదిపింది. దాని చిన్ననోరు, బుల్లికళ్లు, మెత్తని అరచేతులు పదేపదే ముట్టుకొని పరవశించిపోయింది మణెమ్మ. బావ సూరీడు ముందే చెప్పి తీసుకు రావడంతో పిల్లకి పాలియ్యడం తప్ప ఇక దాన్నేమీ పట్టించుకోవడం మానేసింది సీతి. పెద్ద కుర్రాడే తన కన్నవాడు, ఈ పిల్ల తనకేమీ కాదన్నట్టు ప్రవర్తించేది. అది ఆకలికి ఏడు స్తున్నా సరే, మణెమ్మ వచ్చి ఎత్తుకొని తన పొత్తిళ్లలో వేస్తే తప్ప గమనించనట్టే ఉండిపో యేది.

తల్లికి మంచి తిండి, పిల్లకి పొట్టనిండా పాలు, మణెమ్మ మనస్ఫూర్తిగా చేసే పాలన పోషణలో పిల్ల నెల్లాళ్లకే బంతిలా, పూల చెండులా తయారైంది. ఇప్పుడు మణెమ్మ మన సులో వ్యధంతా మంత్రం వేసినట్లు మాయమైంది. ఆ పసిదాని తోడిదే మణెమ్మ లోకం.

మణెమ్మ ఇప్పుడెవ్వర్నీ విసుక్కోదు. సూరీడుని కోప్పడదు. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుంది. ఆ నవ్వుల వెలుగుల్ని నలుగురికీ పంచుతోంది.

ఇప్పుడావిడకి సినిమాలు, చీరలు గుర్తే రావడం లేదు. వారానికోరోజు బజారు కెల్లి పిల్లకి రంగురంగుల గౌన్లు, బూరాలు కొనుక్కొస్తుంది. డబ్బంతా తగలేస్తున్నారెందు కని సీతి కోప్పడుతుంది. ''నీకేం తెలీదు పో, ఇది నా బంగారు తల్లి'' అని ముద్దులాడు తుంది మణెమ్మ పసిదాన్ని.

మూడో నెల రాగానే సీతి మొగుడొచ్చాడు భార్యని వెంటబెట్టుకెళ్లాలని. పిల్లని చూస్తూ ''అచ్చం పెద్దమ్మనాగే ఉంది'' అన్నాడు. మణెమ్మ సంతోషించింది.

''సీతిని తీసుకెల్తా'' అన్నాడతను.

మణెమ్మ గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి, పిల్లదాన్ని తీసుకెల్లిపోతారేమోనని, అది లేని తన బతుకెంత శూన్యమో గుర్తుకొచ్చి వణికి పోయింది.

''అప్పుడే ఏం తొందర? అయిదో నెల్లో పంపిత్తాలే'' అంది.

''ఏం తొందరా? అక్కడ ముసిల్దానికీ నాకూ వండుకోలేక పేసం సాలొచ్చేత్తంది.

సూసుకునీ ఓపికుంటే పిల్లదాన్నుంచేసుకో'' అన్నాడు సీతి మొగుడు.

మణెమ్మ ఆనందానికి హద్దులు లేకపోయాయి. మరోసారి తర్కిస్తే ఎక్కడ తిరిగి పోతాడోనని ఆ మాటే ఖాయం చేసుకుంది. మర్నాడే గుడిసెల వాళ్లందర్నీ పిలిచి భోజనాలు పెట్టింది. పిల్లని ఉయ్యాల తొట్టెలో పెట్టి సిరిదేవి (శ్రీదేవి) అని నామకరణం చేసింది. కూర్చున్న చోట కూర్చోకుండా, నిల్చున్నచోట నిల్చోకుండా తిరిగింది మణెమ్మ ఆ రోజంతా. ఇంత సంతోషం తన జీవితంలో ఎప్పుడూ అనుభవానికి రాలేదనుకుంది. పసిదాన్ని పదేపదే ముద్దుల్తో ముంచెత్తింది. తన దిష్టే తగులుతుందేమోనని గుప్పెడు మిరపకాయలు దిష్టితీసి పోసింది.

సీతికి బంతిపువ్వు రంగు చెమ్కీచీర, చెంద్రయ్యకి పంచె చొక్కా తెప్పించి ఇచ్చింది. ఖర్చులకుంచమని వందరూపాయలిచ్చింది.

కూడా వెళ్లి, దగ్గరుండి బస్సెక్కించి వచ్చింది.

తను అనుకున్నది సాధించిన సూరీడు ఆరోజు గుండెల మీద చెయ్యేసుకుని నిశ్చింతగా నిద్రపోయాడు.

మణెమ్మ నవ్వుతూ గలగలా తిరిగితేనే ఆ ఇంటికి అందం, సూరీడుకానందం.

మానవమాత్రుడు అనుకున్నట్టు రోజులు గడిస్తే ఇక చెప్పుకోవాల్సిందే లేదు. తానొకటి తలిస్తే విధి మరొకటి తలచడమే సాధారణం.

సిరిదేవిని వదిలేసి వెళ్లిన సీతి మరో మూడు నెలల్లోనే గర్భవతి అయ్యింది. అయిదోనెల గర్భంతో ఉండగా చెంద్రయ్య వెంట తాపీ పనికెళ్లిన సీత గోడకూలి ఎత్తుమీది నుంచి కిందపడిపోయింది. పదిరోజులు హాస్పిటల్లో పడకెయ్య వలసి వచ్చింది.

కబురు తెలిసిన మణెమ్మ కూతురుతో సహా వెళ్లి ఆ పదిరోజులూ దగ్గరుండి సీతిని జాగ్రత్తగా చూసుకుంది. హాస్పిటలుకైన ఖర్చులన్నీ తనే పెట్టుకుంది.

ఇంటికి పంపిస్తూ డాక్టరమ్మ చెప్పిన కబురు ఇద్దరి గుండెల్లోనూ ఇనుపగుండై పేలింది. సీతికి గర్భ విచ్ఛిత్తి కావడంతో సరిపోలేదు, ఇక మీద పిల్లలు పుట్టరు...

పసిదాన్ని గట్టిగా గుండెలకి హత్తుకొని రక్తం ఇంకిపోయిన ముఖంతో చూస్తున్న మణెమ్మ భుజాన్ని ఆప్యాయంగా స్పృశించింది. సీతి ''అప్పా ! నా కొక్కడే బిడ్డ, నీ కొక్కతే కూతురు '' అంది. ఆ మాటకి తేరుకున్న మణెమ్మ నవ్వి చెల్లెలి చెక్కిళ్లు ముద్దాడింది. చంకనున్న సిరిదేవి ఏడుపు మొదలుపెట్టింది.

'' ఇదింతేనే, నేనెవ్వరితో మాట్లాడకూడదు. ఎవ్వర్నీ ఇష్టంగా సూడకూడదు. ఎందాకా ఎందుకు, మీ బావకి తలకి నూనెడుతుంటే ఎంత కోపమో దీనికి. చంకలోంచి జారిపోయి, నేలమీద పడి దొర్లి ఏడుస్తాది'' అంది మణెమ్మ కూతుర్ని ముద్దాడుతూ.

సీతి కళ్లల్లో నీళ్లూరాయి.

పెద్దమ్మ దగ్గరిది దొర బిడ్డలా పెరుగుతాంది. తన మొగుడు చెంద్రయ్య తాగుబోతు వేళం. ఉన్న ఒక్క బొట్టెడికి ఒంటి నిండా గుడ్డ, కడుపు నిండా తిండి సూడడు. పోన్లే, దేవుడిలాగ ఒకందుకు మేలే సేసేడు అనుకుంది కళ్లొత్తుకుంటూ.

ఆ రాత్రి చెంద్రయ్య ''ఒదినా! పిల్లదాన్నింక మా కాడ ఒగ్గేసుకుంటాం. మాకు మాత్రం ఆడబొట్టి ఒద్దేటి ?'' అన్నాడు.

అప్పుడే నోట్లో పెట్టుకున్న అన్నం ముద్ద గొంతుకడ్డం పడి కొరబోయింది మణెమ్మకి. కుక్కి మంచంలో పడుకున్న సీతి చటుక్కున లేచి కూర్చుంది. '' ఏం, మాటకి నీతి జాతీ నేదేటి? ఇచ్చేసిన పిల్లని ఏమని ఒగ్గేసుకుంటావయ్యా? అదప్పకాడ రాజానాగ పెరుగుతాంది. నువ్వూ నేనూ పెంచేత్తావేంటి'' అంటూ విరుచుకుపడింది.

'' అ.. అ, నా బిడ్డ నాకు బరువేటి? గెంజి నీళ్లోసుకుని పెంచుకుంటా నేటనుకున్నావో'' అన్నాడు చెంద్రయ్య.

'' అంతే, నీ పెంపకంలో గెంజినీళ్లు తాగి బతకాల్సిందే. అగొచూడు. బొట్టిణ్ణే పెంచుతున్నావు కదా'' అంది సీతి.

'' ఒదినీ, ఉన్నమాట సెప్తున్నాను, నా కూతురు నచ్చిమితల్లి. అది పుట్టగానే మా మేస్త్రీ నాకురెండు రూపాయల జీతం పెంచేసినాడు. దాన్ని నీ కిచ్చేసినకాణ్ణుంచి సానా ఇబ్బందైపోతంది'' అన్నాడు చెంద్రయ్య.

'' అది నీ ఇంట్లో పుట్టిందా నీకదురుష్టం పట్టెయ్యడానికి, ఉప్పుడా అదురుష్టం పోటానికీను''

'' అదేటిది, ఎక్కడ పుడితే నేమే ఎర్రి మొకమా? అది నా కూతురు కాదేటి?'' ఈ లోగా మణెమ్మ లేచి చెయ్యి కడుక్కుని సంచిలోంచి యాభై రూపాయలు తీసి చెంద్రయ్య కందించింది.

చెంద్రయ్య ముఖం వెలిగిపోయింది.'' నాన్జెప్పలే, నా కూతురు నచ్చిమితల్లి, దాని పేరెత్తితే డబ్బులు వర్సంనాగ కురిసేత్తాయ్'' అంటూ బైటకి పోయాడు.

''సిగ్గులేనోడు, సిగ్గులేనోడనీ.....''

చెంద్రయ్య వెళ్లిన వైపు చూస్తూతిట్టుకుంది సీతి. నువ్విలాగ నేర్పించినావంటే ఇంకం తేనోలప్పా. ఆడసలే గుడినీ, గుళ్లో లింగాన్నీ మింగేటోడు'' అంది.

నిద్రపోతున్న చంటిపిల్లని ఆర్తిగా గుండెలకి హత్తుకొని మాటలు రాని మూగజీవే అయ్యింది మణెమ్మ.

ఆ సమయంలో బస్సుల్లేక కానీ, తక్షణం తన ఇంటికి వెళ్లిపోవాలి, ఇక్కడుంటే ఏదో కుట్ర చేసి తన బంగారు తల్లిని లాక్కునేలా ఉన్నారు అనుకుంది.

ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా.... అని కళ్లల్లో వత్తులేసుకొని కూర్చుండిపో

యింది. కోడికూత వినపడగానే లేచి చంటిదాన్ని చంకనేసుకొని బస్సుస్టాండు వైపు నడిచింది. నిద్రపోతున్న చెల్లెలికి కూడా చెప్పాలనిపించలేదామెకి.

ఆ వాడ కట్టులో మణెమ్మ మహారాణి, మణెమ్మ కూతురు యువరాణి. ముట్టుకుంటే మాసిపోయే రబ్బరు బొమ్మలా ఉంటుంది సిరిదేవి. దానికిప్పుడిప్పుడే అడుగు తీసి అడుగెయ్యడం వస్తోంది.

సిరిదేవి నెమ్మదిగా గుమ్మందిగి వాకిట్లో కూర్చుని ఆడుతూ ఉంటుంది. దారిన పోయే అందరి కళ్లూ దాని మీదే. దిష్టి తగిలి పిల్ల చిక్కిపోతుందేమో నని మణెమ్మ భయం. అక్కడికీ దాన్ని గుమ్మం దిగకుండా చెయ్యాలని శతావిధాల ప్రయత్నించింది. కానీ, దాని కిష్టమైన పని చెయ్యనివ్వకపోతే తిక్కపేచీ మొదలెడుతుంది.

అందుకే వాకిలంతా పేడతో అలికి, రాళ్లు రప్పలు లేకుండా గచ్చులా తయారు చేసింది.

ఎప్పట్లాగే ఆ రోజు సాయంత్రం సంధ్యవేళ ముఖం మీద రూపాయంత చాదు బొట్టుతో, ముక్కుచివర నల్లచుక్కతో , కళ్లనిండా కాటుకతో చుట్టూ బొమ్మల్తో వాకిట్లో కూర్చుని ఆడుకుంటుంది సిరిదేవి. గుమ్మంలో పొయ్యిముందు కూర్చుని అన్నం వండుతున్న మణెమ్మ మాటిమాటికీ ఆ పిల్లని చూసుకుని మురిసిపోతూంది . దాని ప్రతి కదిలికా ఆమెకెంతో మురిపెంగా ఉంది.

అదుగో...మళ్లీ..అప్పుడొచ్చాడు చెంద్రయ్య

వస్తూనే పిల్లనెత్తుకొని చంకనేసుకున్నాడు.

చూరు కింద నుంచి వంగి చూసిన మణెమ్మ మనసు గిలగిలలాడింది.

దూరం నుంచి చూసి ఆనందించవలసిందే కాని , ఆ వాడకట్టులో ఎవరికీ సిరిదేవిని ముట్టుకునే హక్కు లేదు.

''వదినే!బాగున్నారా?'' అన్నాడు చెంద్రయ్య పళ్లన్నీ కన్పించేలా నవ్వుతూ, పిల్లని పైకి ఎగరేసి పట్టుకున్నాడు.వార్చబోయిన అన్నం గిన్నె నేల మీద ఎత్తేసి పరుగెత్తింది మణెమ్మ.

'' ఏంటి సెంద్రయ్యా,సంటిదానితో మోటయవ్వారాలు?'' అంది పిల్లని లాక్కుని గుండెలకి హత్తుకుంటూ.

'' ఓలమ్మో,అంతలోనే బెగిలెత్తి పోతన్నావేటొదినే, ఎంత గారాబాలైనా మరీ అంతిది కూడదు.'' అన్నాడు చెంద్రయ్య.

పిల్లని చంకనెత్తుకునే చుట్టంతో సహా అందరికీ మళ్లీ బియ్యం పడేసింది పొయ్యి మీద.

'' ఏం పని మీద వచ్చినా?'' అడిగింది మణెమ్మ.

చెవిలోంచి బీడీ ముక్క తీసి పొయ్యిలోని నిప్పుతో అంటించుకొని తీరిగ్గా ఒక

దమ్ములాగి చెప్పాడు చెంద్రయ్య. '' ఏ చెణంలో పడిపోనాదో నీ చెల్లెలు. ఆయాల్టినుంచీ దానికి మందుల్లేని రోజు లేదు. కూలీనాలీ పనికి రావన్నాడు డాట్టరు. ఇంకో పక్క ఆ ముసిల్దాయెొకతి, ఆ పల్లెటూళ్లో పనుల్లేక, ఉన్నరోజు ఒక్క సేతి సంపాదనతో సంసార వీడ్వలేక సచ్చిపోతున్నాననుకో వదినే''

ఆ మాటే సూరీడు వచ్చాక మళ్లీ చెప్పాడు.

'' అయితే ఏటంటా వింతకీ?'' అన్నాడు సూరీడు.

'' ఏటుంది, ఇక్కడైతే రోజువారీ ఏదో పని సేసుకోవచ్చు, మీ పంచనే ఇంత ఉడకేసుకు తింటాం'' అన్నాడు జాలిగా. ''కన్న రునానికి ఈ గుంటని కళ్లతోనైనా సూసుకుందావని ఆస'' అన్నాడు చివరగా తన కూతురు వాళ్ల దగ్గరున్న విషయాన్ని గుర్తుచేస్తూ. ఆ మాట వాళ్ల మీద బాగా పని చేస్తుందని తెలుసు చంద్రయ్యకి.

సూరీడుకి మొదటిసారిగా అన్పించింది. 'తానీ విషయంలో పొరపాటు చేసానా' అని . ఆ పెంచేదేదో ఎవరూ లేని ఏ అనాథ పిల్లనో పెంచుకోవాల్సింది అని కూడా అనుకున్నాడు.

మౌనం అంగీకారంగా తీసుకున్న చెంద్రయ్య, మూడో రోజు కల్లా కుటుంబంతో తరలి వచ్చాడు.

వచ్చిన పదిరోజులు ఏంబుద్ధిగా ఉన్నాడో చెంద్రయ్య, ఆ తర్వాత అంతా మామూలే.

సాధారణంగా-కూలికెళ్లకుండా కుక్కి మంచంలో ముసుగెట్టుకుని పడుకుంటాడు. వెళ్లిన రోజు కూలి డబ్బులన్నీ కల్లుపాకకి సమర్పించేసి వస్తాడు. తరచుగా మణెమ్మని, సూరీడుని డబ్బులడిగి తీసుకుంటాడు. అలా తీసుకునేటప్పుడతని ధోరణి అదేదో తన జన్మహక్కు అన్నట్లుంటుంది.

అదనంగా వచ్చిపడిన కుటుంబ భారాన్ని మోయలేక సూరీడు అప్పులు చేయాల్సివస్తోంది. అది ఎన్నాళ్లో సాధ్యం కాక మణెమ్మ కూడా కూలీనాలీ చెయ్యడానికి సిద్ధపడింది.

మణెమ్మ ఇప్పుడు మహారాణి కాదు.
పెంచిన మమకారం అనే 'కీ' నడిపిస్తున్న బొమ్మ.

కష్టసుఖాల్తో ప్రమేయం లేని కాలం మరో ఏడాది ముందుకుసాగిపోయింది.

మణెమ్మ కూతురు సిరిదేవికిప్పుడు రెండేళ్లు. ఇప్పుడు దాన్ని చూస్తే దాని పోషణలో తేడా ఎంతగా వచ్చిందో చెప్పెయ్యొచ్చు. మణెమ్మ సాయంత్రం పనిలోంచి వచ్చేవరకూ అది మురికి కాలవల్లో యథేచ్ఛగా ఆడుకుంటుంది. దాని తిండికి ఇప్పుడొక టైమంటూ లేదు. చెంద్రయ్య, సీతి, ముసిల్ది అందరితోను తలా ఒక ముద్ద

తినిపిస్తుంటారు. చెంద్రయ్య అప్పుడప్పుడు ఆ పిల్లని రోడ్డు మీదికి ఎత్తుకొని పోయి బిళ్లలు, జీడీలు కొనిపెడుతుంటాడు. ఆ రోజంతా ఈగలు దాని ఒంటి మీద ఝువ్వుమని ముగుతూ ఉంటాయి. అవన్నీ చాలవని ఆ పిల్లకూడా ఆడుతూ ఆడుతూ మట్టి బాగా తింటూ ఉంటుంది. ఇప్పుడిప్పుడు దానికిబాన పొట్ట, పుల్లల్లాంటి చేతులు, కాళ్లు తయారవుతున్నాయి.

ఆ పిల్ల ఇప్పుడు చెంద్రయ్యకి బాగా చేరికైంది. సీతిని అమ్మ అని, చెంద్రయ్యని నాన్న అని అంటూంది. మణెమ్మని చూసినా మీదికి ఉరకడం మానేసింది. మణెమ్మ రాగానే ముందు దాని ఒళ్లు రుద్ది నీళ్లు పోస్తుంది. అది కంటకం దానికి.

ఇదంతా మణెమ్మకి కడుపుకోతగా తయారైంది. భరించడం ఇక సాధ్యం అనిపించలేదు.

ఆ రోజిక అమీ తుమీ తేల్చెయ్యాలనుకుంది.

పనిలోకి వెళ్లబోతున్న సూరీడుని చెయ్యిపట్టి ఆపేసింది.

వాకిట్లో కుక్కి మంచంలో చిరిగిన దుప్పటి కప్పుకొని పడుకున్న చెంద్రయ్య దుప్పటి కంతలోంచి బీడీపొగ గుప్పుగుప్పున వదుల్తున్నాడు. ఆ మంచం పక్కనే నేల మీద కూర్చుని సీతి కొడుకుతో ఆడుతోంది సిరిదేవి.

చెంద్రయ్య కప్పుకున్న దుప్పటి లాగి దూరంగా విసిరికొట్టింది మణెమ్మ. అనుకోని ఉధృతానికి ఉక్కిరి బిక్కిరయ్యాడు చెంద్రయ్య. ఆశ్చర్యపోతూ లేచి కూర్చున్నాడు.

''ఎన్నాల్లిట్టా?'' గట్టిగానే అడిగింది మణెమ్మ.

''ఎట్టా?'' అన్నాడు చెంద్రయ్య కాస్త సర్దుకుని.

''అదే, సెట్టంత మగోడివి, దున్నపోతులాగున్నోడివి ఇట్టాకూకుని తింటం ఎన్నాల్లని?''

వ్యంగ్యంగా నవ్వేడు చెంద్రయ్య.'' ఏం, బాదగా ఉందా వదినే? ఒకరి సొమ్ముకి మనం ఆసించేటప్పుడు తిరిగి ఏదో ఇదంగా రునం తీర్చుకోపడం సబువేనా కాదా?''

''అంటే?''

''అర్థం కాపోటానికేటుందిందులో. ఉప్పుడు కొత్తగా నేను ఇప్పిసెప్పాల్సింది ఏదీ లేదు.'' అన్నా డు నిర్లక్ష్యంగా చెంద్రయ్య.

''పోనీ, ఇంతకావాలని అడగరా సెంద్రిగా, నానిత్తాను. అదట్టుకొని పిల్లనొగ్గేసి ఎలిపోండి'' అన్నాడు సూరీడు.

''ఒరొల్లకోరా అన్నా! గొడ్డోల్లకేం దెలుత్తాదెహె బిడ్డల సొరాయుం'' మణెమ్మ కోపం నషాళాని కంటింది.

''ఒరొరేయ్, ఒరి సెంద్రిగా!తచ్చణం ఇక్కణ్నుంచి పొండిరా. నాగువమ్మంలో

మరొక్క ఖణం ఉన్నారంటే నరికి పోగులేట్టేగల్సు'' అంది మండిపడుతూ.

''నా పిల్లనిచ్చి, నానెల్లి పోతాను''

పిల్ల నివ్వడానికెలాగూ ఒప్పుకోరని పాతపాటే పాడబోయాడు చెంద్రయ్య.

దానికి ఊహ తెలిసొత్తాంది. బలవంతంగా ఎత్తుకెల్లినా ఆల్లకూడా ఎల్తాదేటి' అని ధీమా మణెమ్మకి. ''పోరా, నీ పిల్లని నువ్వే అట్టుకుపో' పైకి మాత్రం బింకంగా అంది.

చివ్వుమని లేచాడు చంద్రయ్య. పెళ్లాన్నీ, ముసిల్దాన్నీ ఒకో తన్నుతన్ని లేపాడు. నిమిషాల్లో ప్రయాణం కట్టేసాడు. ఆడుకుంటున్న పిల్లనెత్తుకొని చంకనేసుకున్నాడు.

'' ఇది నాయం కాదురా సెంద్రయ్యా'' అన్నాడు సూరీడు అడ్డొస్తూ. అప్పటికే ఆ వాడకట్టులోని నలుగూరారూ పోగయ్యారక్కడ. వయసులో పెద్దదైన ముసల్ది న్యాయం చెప్పడానికి ముందుకొచ్చింది.

'' ఓరి సెంద్రయ్యా! అదికాదు పద్దతి, పిల్లని కన్నది నువ్వైనా, పెంచింది మణెమ్మ. పిల్లదానికి ఎవురిమీద ఎక్కువ పేణవుందో, అదెవరికాడుండాలనుకుంటందో తేల్చుకోండి ముందు'' అంది.

పిల్లని కుక్కి మంచంలో కుదేసాడు చెంద్రయ్య.

''నీకెవరు కావాలోలమ్మా, ?'' అడిగింది ముసల్ది పిల్లని.

అది మణెమ్మవైపు దృష్టి నిలిపింది. మణెమ్మ గుండె సంతోషంతో ఎగసిపడింది. కాని, చివరికి ''నాన్న'' అని చెంద్రయ్యకి చేతులందించింది.

చెంద్రయ్య విజయగర్వంతో ముందుకడుగేసాడు.

మణెమ్మ గుండె కుంగిపోయి నిలువునా కుప్పకూలిపోయింది.

కథా నిలయం
4568
శ్రీకాకుళం

(సెప్టెంబర్-88, జ్యోతి మంత్లీ)